## క్లుప్తంగా

### మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

బలిజిపేట: విద్యుత్‌శాఖ నిర్ల క్ష్యంతో మరమ్మతులకు గురైన గంగాడ రక్షిత మంచి నీటి పథకం పైపులైనుకు ఆ శాఖ అధికారులు మరమ్మ తులు చేయించారు. సాక్షి దినపత్రికలో గురువారం వెలువడిన 'విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో పైప్‌లైన్‌కు మరమ్మతులు' అనే కథనంపై అధికారులు స్పందించారు. వంతరాం సబ్‌స్టేషన్ నుంచి వేస్తున్న కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు సమయంలో రక్షిత మంచినీటి పథకం పైపులైను పాడైంది. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఇటీవల పథకం నిర్వహణకు పంచాయతీ నిధులతో 500 మీటర్ల కొత్త పైప్‌లైన్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సూర్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం రూరల్: మండలంలోని జమ్మిడివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ మూడడ్ల సూర్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి సూర్యనారాయణ కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. పార్టీ తరఫున వారి కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, మజ్జి శేఖర్, బీసీసెల్ అధ్యక్షుడు జి.మాధవరావు, బంకపల్లి వాసుదేవరావు తదితరులున్నారు.

### లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడిన లక్ష్మీనృసింహ స్వామి ఆలయం

సీతానగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు గురువారం పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ముడుపుల పూజలు చేసేందుకు ఆలయ ప్రాంగణమంతా భక్త సందోహంతో నిండి పోయింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### విశ్వాసుల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న బెలగాం కతోలిక విశ్వాసులు

పార్వతీపురం: క్రైస్తవ విశ్వాసులకు ఎంతో పవిత్రమైన గుడ్ ఫ్రైడేని పురస్కరించుకొని 45రోజులు ముందు నుంచి ప్రత్యేక ప్రార్థనలు, దీక్షలు విశ్వాసులు భక్తి శ్రద్ధలతో పాటిస్తున్నారు. ఈ క్రమంలో పార్వతీపురం బెలగాంలో ఉన్న పునీత కార్మిక జోజప్ప దేవాలయ దీక్షాపరులు బెలగాం నుంచి శివినిలో ఉన్న బాలయేసు దేవాలయం వరకు పశ్చాత్తాప పాదయాత్ర గురువారం ఉదయం 5గంటలకు నిర్వహించారు. పాదయాత్ర అనంతరం శివినిలో కతోలిక గురువులు అంథోని, కె.తోమస్‌రెడ్డి, దివ్య పూజాబలిని నిర్వహించారు.

### ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు పెంచాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బి.శ్రీధర్, ఎ.చిట్టిబాబు, టి.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణం భారం

- భారీగా పెరిగిన ఐరన్, సిమెంటు ధరలు
- సిమెంటు బస్తాకు రూ.90లు పెరుగుదల
- టన్నుకు రూ.10వేలు పెరిగిన ఐరన్
- ధరల నియంత్రణలో విఫలమైన ప్రభుత్వం



పార్వతీపురంలో భవన నిర్మాణం

పార్వతీపురం టౌన్:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పది నెలల వ్యవధిలోనే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయి. తాజాగా సిమెంట్, ఐరన్ ధరలను పెంచింది. జీవనోపాదులకై పనులు దొరక్క కూలీలు వలసబాట తప్పడం లేదు. జిల్లాలో భవన నిర్మాణాలు, సొంతిళ్ల నిర్మాణాలకు అవసరమైన ముడిసరుకు ధరలు ఆకాశాన్ని అంటడంతో భవన నిర్మాణ యజమానులు ఆందోళన చెందుతున్నారు. సిమెంట్, ఐరన్ ధరలకు రెక్కలొచ్చాయి. ఒక పక్క ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ దళారులచే ఇసుక సరఫరా చేయించడం, పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్న సిమెంట్, ఐరన్ కంపెనీలు ధరలు మోగిస్తుండడంతో భవన నిర్మాణదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేమని భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

**కొరవడిన ప్రభుత్వ నియంత్రణ**

వేసవిలో సహజంగా ఇళ్ల నిర్మాణ పనులు ఊపందుకుంటాయి. ఇదే అదునుగా చేసుకొని కంపెనీలు ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. కంపెనీలు సిండికేట్‌తో సిమెంట్ ధరను అమాంతం పెంచాయి. మూడు రోజుల వ్యవధిలో సిమెంట్ బస్తాకు రూ.80 నుంచి రూ.90 వరకు పెరిగింది. ఐరన్ నెల రోజుల వ్యవధిలో రూ.10వేలు పెరిగింది. ధరల పెరుగుదలపై ప్రభుత్వం నియంత్రణ పూర్తిగా కొరవడింది. దీంతో కంపెనీలు ధరలపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని నిర్మాణదారులు ఆరోపిస్తున్నారు. ధరల పెరుగుదల నిర్మాణదారులపై ఎనలేని ఆర్థిక భారం పడుతుంది. సిమెంట్ ధర పెంచడంతో పాటు సరఫరాను కంపెనీలు తగ్గించేశాయి.

**ప్రస్తుతం పెరిగిన ధరలు ఇలా..**

| వివరాలు | పాత ధర | కొత్త ధర |
|---|---|---|
| నాగార్జున సిమెంట్ | రూ.280 | రూ.380 |
| సాగర్ సిమెంట్ | రూ.240 | రూ.310 |
| రామ్‌కో సిమెంట్ | రూ.250 | రూ.330 |
| ఐరన్ | రూ.57,900 | రూ.68,000 |

**ఉచిత ఇసుక ఉత్తిదే...**

ప్రభుత్వం ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని హామీ ఇచ్చి గాలికొదిలేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అక్రమార్కులదే హవా అయ్యింది. ఇసుక సైతం రూ.వేలల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో కొమరాడ మండలం కళ్లికోట, మక్కువ మండలం డి.శిర్లాం, పాలకొండ మండల పరిధిలో ఇసుక అందుబాటులో ఉన్నా కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో ఇసుక రేటు సైతం చుక్కలు చూపిస్తుంది.

**ఇల్లు కట్టాలంటే..**



సిమెంట్, ఇసుక ధరలు భారీగా పెరగడంతో ఇల్లు కట్టుకున్న వారిపై భారీగా భారం పడుతుంది. సిమెంట్ వ్యాపారులంతా సిండికేట్‌గా తయారై భారీగా రేట్లు పెంచారు. ప్రభుత్వం సైతం ధరల నియంత్రణపై దృష్టి సారించడం లేదు. సామాన్యులకు సొంతిల్లు కలగానే మిగిలిపోయింది.

– పాలకొల్లు శంకరరావు, భవణ నిర్మాణదారు, పార్వతీపురం

**భారీగా ధరలు పెరిగాయి**



సిమెంట్, ఐరన్, ఇసుక రేటు అమాంతంగా పెరగడంతో ఇంటి నిర్మాణ పనులు ఆపేశాం. ప్రస్తుతం సిమెంట్ ధర రూ.380కి చేరింది. ఐరన్ ధర కూడా పెరిగింది. ప్రభుత్వం ధరల నియంత్రణపై దృష్టి సారించడం లేదు. ఇసుక ఉచితమన్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇసుక ఉచితంగా దొరికే పరిస్థితి లేదు. రూ.3,500లకు ఇసుక కొనుగోలు చేస్తున్నాం. ధరల పెరుగుదలతో నిర్మాణ పనులు చేయాలంటే భయమేస్తోంది.

– చీపురుపల్లి విజయ్, భవణ నిర్మాణదారు, పార్వతీపురం

## అంగన్‌వాడీల అవగాహన ర్యాలీ



తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. పోషణ పక్షోత్సవాల సందర్భంగా బలిజిపేట మండలం అరసాడలో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డను వెయ్యి రోజులు కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. బిడ్డ సంరక్షణ, తల్లిపాలు ప్రాధాన్యత గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు. – బలిజిపేట

## మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలి



డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పార్వతీపురం టౌన్: జిల్లాలో మొక్కజొన్న సాగు చేసే రైతుల చేతికి పంట అందివచ్చినా... ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు బంటు దాసు అన్నారు. ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారిణి హేమలతకు ఈ మేరకు గురువారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పలువురు రైతులు ఉన్నారు.

## ప్రమాదకరంగా జాతీయ రహదారిపై గోతులు



ఆర్.వెంకంపేట జంక్షన్ వద్ద కల్వర్టుకు పడిన గొయ్యి

సీతానగరం:

నిత్యం వందల వాహనాలు తిరుగాడే జాతీయ రహదారిలో ఆర్.వెంకంపేట జంక్షన్ వద్ద నున్న కల్వర్టుకు ఇరువైపులా ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా మారాయి. ఈ గోతుల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నా.. ఇటు పాలకులకు.. అటు అధికారులకు పట్టడం లేదు. సీతానగరం – బొబ్బిలి గ్రామాల మధ్య రోడ్లు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

## విద్యార్థులు మంచి విషయాలపై దృష్టి సారించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

మక్కువ: విద్యార్థులు మంచి విషయాలపై దృష్టి సారించాలని ఏఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కాశీపట్నం కేజీబీవీ, ములక్యాయవలస ఆదర్శ పాఠశాలల్లో గురువారం శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు మహిళా ఉపాధ్యాయులు వివరించాలన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థినుల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ట్రైనీ ఎస్‌ఐ నవనీత, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం రూరల్: ఎంఆర్ నగరం 11 కేవీ ఫీడర్, గంగాపురం 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ రామారావు గురువారం తెలిపారు. వెంకంపేట, చినబొండపల్లి, ఎంఆర్ నగరం, సంగంవలస, అడ్డూరువలస, రావికోన, రంగాలగూడ, ఎల్ఎన్ పురం, చినమరికి, పెదమరికి గ్రామాలతో పాటు డోకిశీల, గోచెక్క, డీకే పట్నం, గంగాపురం, ములగ, కవిటిభద్ర గ్రామాల పరిధిలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### కంపు కొడుతున్న నారాయణపురం

బలిజిపేట: నారాయణపురం గ్రామంలో వీధులు, కాలువలు చెత్తతో నిండి కంపు కొడుతున్నాయని రైతు సంఘం, సీపీఎం నాయకులు జి.సత్యనారాయణ, డి.త్రినాధ తెలిపారు. గ్రామంలో గురువారం వారు పర్యటించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూశారు. మురుగు ఎక్కడికక్కడ పేరుకుపోయి ప్రజలు దుర్గంధం భరించలేకపోతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట సీపీఎం నాయకులు మన్మధరావు, వెంకటరావు తదితరులు ఉన్నారు.

### బలవంతపు తీర్మానాలు సరికాదు

పార్వతీపురం టౌన్: పాఠశాలల పునఃవ్యవస్థీకరణ నేపథ్యంలో ఎస్ఎంసీ కమిటీల ద్వారా ఆదరాబాదరాగా బలవంతపు తీర్మానాలు చేయడాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఖండించారు. ఈ మేరకు గురువారం పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునః వ్యవస్థీకరణలో భాగంగా ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటుకు యూపీ పాఠశాలలను డీగ్రేడ్ చేయడం, మోడల్ స్కూల్స్ ఏర్పాటుకు తీర్మానాలను చేయించి అప్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు.



## ఫైలేరియా కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: పెదపెంకిలో ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు మోరబీ డీటి మేనేజ్‌మెంట్ కిట్లు సర్పంచ్ పాపారావు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్ గురువారం పంపిణీ చేశారు. జిల్లా మలేరియా కార్యాలయం నుంచి వచ్చిన వీటిని పంపిణీ చేసినట్టు వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి తెలిపారు. ఒక కిట్టులో ఒక సబ్బు, తువ్వాలు, స్కిన్ ఆయింట్‌మెంట్, ఒక మగ్గు ఉంటాయని పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులు పాడైన భాగాన్ని శుభ్రం చేసుకునేందుకు అనుకూలంగా ఈ కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. బాధితులు వాటిని ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై వారికి అవగాహన కల్పించారు. ప్రతీ రోజు తప్పనిసరిగా పరిశుభ్రం చేసుకోవడం వలన వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్ సత్యవతి, జ్యోతి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడీకి సత్కారం



డాక్టర్ దీనకుమార్‌ను సత్కరిస్తున్న పాల ఉత్పత్తిదారులు

సీతానగరం: విజయనగరం, పార్వతీపురం మన్యం (ఉమ్మడి జిల్లా)జిల్లా వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన స్థానిక పశుసంవర్ధక శాఖ సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను పాల ఉత్పత్తిదారులు స్థానిక ఆస్పత్రిలో గురువారం సత్కరించారు. ఈ మేరకు జెడ్పీటీసీ ఎం.బాబ్జీ మాట్లాడుతూ పశువైద్య సేవలను నిరంతరంగా నిర్వర్తించడంతో పాటు పశు వైద్యాధికారుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం పాల ఉత్పత్తి దారులు, సేవా కార్యకర్తలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాశీపేట పాల ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షుడు తేలు శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.ధనంజయ్‌రావు, ఎల్ఐసీ సీనియర్ ఏజంట్ ఆర్నిపల్లి శివున్నాయుడు, పాల ఉత్పత్తిదారులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి వేతనదారుల ఆందోళన



ధర్నాలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా పనుల్లో పాల్గొనే వేతనదారులకు తక్షణమే బిల్లులు చెల్లించాలని కోరుతూ నిడగల్లు సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఆర్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేసిన 14 రోజుల్లోగా బిల్లులు చెల్లించాలని మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. వేతనదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం కార్యదర్శికి అందజేశారు.

## ఘనంగా ఎల్లమ్మతల్లి పండగ



డప్పు వాయిద్యాలతో తిరువీధి చేస్తున్న అమ్మవారి ఘటాలు

సీతానగరం: మండలంలోని ఇప్పలవలస గ్రామంలో ఎల్లమ్మతల్లి అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. గ్రామంలోని గుల్ల కుటుంబీకులు ఇంటి దేవతగా పూజించే ఎల్లమ్మ పండగను పురస్కరించుకుని గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎల్లమ్మ పండగ కారణంగా జమికిలి కళాకారులు చిరంజీవి బృందం ఆధ్వర్యంలో ఎల్లమ్మ చరిత్ర జానపద కళారూపంలో ప్రదర్శించారు. భక్తులందరికీ నిర్వాహకులు ఎంపీటీసీ సభ్యురాలు గుల్ల సంతోషికుమారి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గుల్ల శంకరరావుతో పాటు కమిటీ ప్రతినిధి, వెంకటనాయుడు ప్రసాదాలు పంపిణీ చేశారు.

### వేతనదారుల కోరిక మేరకే మేట్ల ఎంపిక



మాట్లాడుతున్న ఏపీఓ భాను

సీతానగరం: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న మెజార్టీ వేతనదారుల సూచనల మేరకే మేట్లను నియమిస్తున్నట్టు ఆ పథకం ఏపీఓ భాను తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో లచ్చయ్యపేట వేతనదారులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల మేరకు మేట్లను నియమిస్తున్నామని, తదుపరి రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు తెలిపారు. జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, మేట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

### ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

మక్కువ: మండలంలోని ములక్యాయవలస ఆదర్శ పాఠశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న జరగబోయే ప్రవేశ పరీక్ష ఈస్టర్ పర్వదినం సందర్భంగా మార్పు జరిగినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల మధ్య జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు.

### కూటమి నాయకులు ఇబ్బంది పెడుతున్నారు..!

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఉపాధి వేతనదారులపై స్థానిక నాయకులు కక్ష సాధిస్తున్నారని మండలంలోని ఎల్ఎల్ పురం గ్రామానికి చెందిన వేతనదారులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సర్పంచ్ ద్వారపూడి సావిత్రమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమార్‌ను గురువారం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వేతనదారులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో మూడు వందల మంది వేతనదారులు పనులపై ఆధారపడి కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు.

## రక్తహీనత నివారణకు చర్యలు



గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ ఉష

సీతానగరం: గర్భిణుల్లో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.ఉష అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో పీఎంఎంవై పథకం ద్వారా గర్భిణులకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉష మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై క్షేత్ర స్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రసవ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరాలని సూచించారు. వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.